క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మణుగూరుటౌన్: మండలంలోని 11కేవీ గుట్టమల్లారం ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలిగింపు పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం పూజారినగర్, మణికంఠనగర్, రాజీవ్‌గాంధీనగర్, గుట్టమల్లారం నుంచి అంబేడ్కర్ సెంటర్ మెయిన్ రోడ్, ప్రభుత్వ హాస్పిటల్ ఏరియా, కోర్టు ఏరియా, సాయిబాబా టెంపుల్ ఏరియాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

బూర్గంపాడు: టేకులచెరువు గ్రామ సమీపంలోని దోమలవాగును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని మండల రైతులు, పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లును కోరారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, రైతులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. సీతారామ ప్రాజెక్ట్ కాలువను దోమలవాగు చెరువుకు అనుసంధానం చేస్తే 1500 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే టేకులచెరువు, లక్ష్మీపురం, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపాడు, మోరంపల్లిబంజర అంజనాపురం, నకిరిపేట, వేపలగడ్డ గ్రామాల రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని వివరించారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బట్టా విజయ్‌గాంధీ, బాదం రమేష్‌రెడ్డి, బాదం నాగిరెడ్డి, బర్ల నాగమణి, ఇంగువ రమేష్, లక్ష్మీనారాయణరెడ్డి, సర్పా వెంకటేశ్వర్లు, సపావత్ సీతారాం, తేజావత్ పున్న, మేకల నర్సింహారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా జలగం జన్మదిన వేడుకలు



దమ్మపేటలో కేక్ కట్ చేస్తున్న జలగం అభిమానులు

దమ్మపేట: మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు జన్మదిన వేడుకలను ఆయన అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినంను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, అభిమానుల సమక్షంలో పెద్ద కేకును కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకులు కోటగిరి పుల్లయ్య బాబు, దారా యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, రావుల శ్రీను, గొట్టిపుళ్ల దుర్గాశ్రీనివాస్, జలగం వాసు, చీకటి శ్రీను, చిన్నశెట్టి శశిధర్, రామకృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

అశ్వారావుపేటరూరల్: కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక జలగం యువసేన ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ముందుగా అనాథశ్రమంలో కేక్ కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అదే విధంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువసేన బాధ్యులు చిక్కం గోపాలకృష్ణ, కోటగిరి మోహన్ రావు, ఎస్‌కె.ఫకీర్, నాయుడు శ్రీను, మూర్తి, సాత్విక్, భార్గవ్, స్థానిక బీజేపీ నాయకులు మెట్టా వెంకటేష్, ఎస్‌వీటీ కొండ, ఆంజనేయులు, పమ్మిడి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మండల కేంద్రంలో మణుగూరు ఎస్సై మేడా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. పట్టణ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి సంబంధిత పత్రాలను, పెండింగ్ ఛలాన్ల వివరాలను పరిశీలించారు.

అనుమానస్పద వ్యక్తుల వివరాలను సేకరించి వదిలేశారు. సరైన పత్రాలు లేని వాహన యజమానాలను ఈ-చలానాలను విధించారు. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ మత్తులో యువత

- పట్టణాల నుంచి పల్లెకు పాకిన వ్యసనం
- గోదావరి తీరాన యువకుల పార్టీలు



మణుగూరు రథం గుట్ట పార్క్ వద్ద బైక్‌పై తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

పినపాక: మత్తులో యువత భవిష్యత్తు చిత్తవుతోంది. పట్నంలో భారీగా యువత మత్తుపదార్థాలు వాడుతుండగా.. ఆ అలవాటు కాస్త పల్లెలకూ చేరింది. ఇటీవల కాలంలో నిత్యం పినపాక కరకగూడెం మణుగూరు మండలాల్లో భారీగా గంజాయి పట్టుబడటం దీనికి సంకేతంగా నిలుస్తోంది.

వలస కార్మికులే టార్గెట్

గంజాయి వినియోగం మండలాల్లో భారీగా పెరిగింది. పినపాక మండల సరిహద్దులో గత కొన్ని సంవత్సరాల క్రితం భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రభుత్వం నిర్మించింది. ఇందులో కార్మికులుగా పనిచేయడానికి ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పనిచేయడానికి ఇక్కడికి వచ్చారు. వారిని లక్ష్యంగా చేసుకుని, కొందరు భారీగా గంజాయిని అక్రమ మార్గాల నుంచి తీసుకువస్తున్నారు. అధికారులు ఎంత కట్టడి చేసినా గంజాయి వినియోగం తగ్గడం లేదు.

గోదావరి తీరమే అడ్డాగా..

గంజాయి, మత్తు పదార్థాలు వాడే యువత గోదావరి తీరాలను అడ్డాగా చేసుకుంటున్నారు. పినపాక మండలంలో భూపతిరావుపేట, చింతల బయ్యారం, రాయి గూడెం, రామానుజవరం, చిన్న రాయి గూడెం గోదావరి తీరాల వద్ద పార్టీలు చేసుకోడానికి అనువుగా ఉంటాయి. శని, ఆదివారాలలో స్నేహితులతో కలిసి మత్తు పార్టీలు చేసుకుంటున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు కంటపడకుండా ఇవి అనువైన స్థలాలుగా యువత భావిస్తున్నారు.

ఈ పరిస్థితులపై పోలీస్ అధికారుల దృష్టి పెట్టి మత్తు పదార్థాలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

కట్టడి చేస్తున్నాం..



యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పూర్తిస్థాయిలో కట్టడి చేస్తున్నాం. గ్రామాలు, కళాశాల్లో యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గోదావరి తీరాల వెంబడి నిగా పెట్టాం. పూర్తిస్థాయిలో మత్తు పదార్థాలను కట్టడం చేస్తాం.

– రాజ్ కుమార్, ఎస్సై, ఈ బయ్యారం

ఇటీవల మండలంలో నమోదైన కేసులు..

- పినపాక మండలం ఉప్పాక బ్రిడ్జి సమీపంలో కారులో తరలిస్తున్న 21 కేజీల గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు.
- సీతారాంపురం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై తీసుకువెళ్తున్న మూడున్నర కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- గోపాలపట్నం గ్రామ సమీపంలో తోగుడెం గ్రామం నుంచి ఆటోల తరలిస్తున్న కేజీ గంజాయి పట్టుబడింది.
- మణుగూరు రథం గుట్ట పార్క్ వద్ద బైక్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్న 5 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



దుమ్ముగూడెం: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న నల్లబల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. లబ్ధిదారుడు సున్నం రాంబాబు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పునాదికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం కొన్ని రోజుల క్రితం గాలివానతో ఇల్లు కూలిన శ్రీనగర్ కాలనీకి చెందిన జిలకర రమేష్, రామారావుపేట గ్రామానికి చెందిన కారం గోపాల్ కుటుంబాలను పరామర్శించి మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మండల నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారాయణ మూర్తి, కెల్లా శేఖర్, మోతుకూరి శ్రీకాంత్, కోడి చంటి, తోట రమేష్, యంబడి అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పరిశీలన..



మణుగూరుటౌన్: ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మండలంలోని లంక మల్లారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లులను శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. లబ్ధిదారులు గనిబోయిన పార్వతి, పాయం హేమలత, పాయం నర్సమ్మ, పాయం అలివేలు, పోలోజు అశ్విని, దుగ్గం విరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేస్‌మెంట్ వరకు పని పూర్తి చేసిన లబ్ధిదారులకు వెంటనే రూ.లక్ష ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు శివ, సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలే అండ



సమావేశంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించుకుంటారని, దేశంలో కులగణను అడ్డుకోవడానికే సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు మోపారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం శుక్రవారం ఆయన మాట్లాడారు. రాహుల్‌ని చూసి ప్రధాని మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా ఈవీఎమ్ మిషన్లు కాకుండా బ్యాలెట్ పద్ధతి కావాలని ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బీజేపీ అక్రమ కేసులు పెడుతుందని ఆరోపించారు. దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో జై బాపు జై భీమ్ జై సమిధాన్ ర్యాలీ శనివారం ఉదయం 9 గంటలకు భద్రాచలం పాత మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం నుంచి భద్రాచలం అంబేద్కర్ కొనసాగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

లక్ష మల్లెపూలతో సహస్రనామార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగి 40 రోజులు అయిన సందర్భంగా స్వామి వారికి శుక్రవారం మండలాభిషేకం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పూజారుల వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి, హారతి, తీర్థప్రసాదగోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి లక్ష మల్లె పూలతో సహస్ర నామార్చన కార్యక్రమం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్రి మల్లారెడ్డి, సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మర్యాద దినోత్సవం



ప్రయాణికులకు గులాబీ పూలు, కీ చైన్ అందజేస్తున్న ఆర్టీసీ డీఎం తిరుపతి

భద్రాచలంఅర్బన్: ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుంటూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులకు పుష్పగుచ్చాలు అందించి వారికి ఆర్టీసీ కీ చైన్‌ను అందజేశారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవల వివరాలను తెలియచేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం తిరుపతి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి ప్రయాణ సమయంలో ఇబ్బంది కలగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ గౌతమి, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు, వెల్ఫేర్ మెంబర్ కవిత, ఎమ్మెస్ రావు, ఆర్‌కె.ప్రసాద్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామరచర్ల గ్రామానికి చెందిన శేవాల నాగేశ్వరరావు తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై జంగారెడ్డిగూడేనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే అశ్వారావుపేట మండలం ఆసుపాక వద్ద బైక్ అదుపుతప్పి కింద పడింది. తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి.. ఆపై ఏలూరు ఆస్పత్రికు తరలించారు.

నాసిరకం పనుల వల్లే..

ములకలపల్లి: నాసిరకం పనుల వల్లే సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువపై నిర్మించిన పాసేజ్ పిల్లర్ కూలిపోయిందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కొర్సా రామకృష్ణ ఆరోపించారు. పిల్లర్ నేలమట్టమైన ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్



పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

భద్రాచలంఅర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఫిల్లింగ్ స్టేషన్‌లో (పెట్రోల్ బంకుల్లో) అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయిల్, గ్యాస్ అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వినియోగించాల్సిన వస్తువులు, ఏ సమయంలో వేటిని వినియోగించాలనే దానిపై ప్రదర్శన చూపారు. అనంతరం పరిసర ప్రాంతాల ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని శుక్రవారం ముస్లింలు అశ్వారావుపేటలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లోని మదీనా మసీద్ నుంచి శ్రీ పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టం పేరుతో వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న ఆస్తులు, భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బోర్డులో ముస్లింయేతరులకు అవకాశాన్ని కల్పించి, ముస్లింల స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. ఈ బిల్లును తామంతా వ్యతిరేకిస్తున్నామని, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.వలీపాషా, ఎస్‌కె.నజీర్, ఎండీ.ఆసిఫ్ అలీ, జాకీర్, బాబా, సర్దార్, రఫీ, ముఖరం ఖాన్ పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



అశ్వారావుపేటరూరల్: నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

భద్రాచలంటౌన్: ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డ్ చట్టం బిల్లు సవరణ వ్యతిరేకిస్తూ డివిజన్‌లోని అన్ని మసీద్ కమిటీల ఆధ్వర్యంలో భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్లా షఫీ, అలీ పాషా, అజీమ్, జిందా, సుకూర్, మస్తాన్, అక్బర్, అలీమ్ ఖాన్, రహీం, జాకీర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సారపాకలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముస్లింల భూములను లాక్కునేందుకు కేంద్రం కుట్రపూరితంగా వక్ఫ్ చట్ట సవరణను తీసుకువచ్చిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె.అబీదా, పాపినేని సరోజిని, ఐలమ్మ, పద్మ, రాధ, నూర్జాన్, జరీనా, సహిదా, సాధిక, షకీరా, గౌస్, బేగం తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సారపాకలో సీపీఎం నిరసన

లోక రక్షణకే బలిదానం

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం వివిధ ప్రాంతాల్లోని క్రైస్తవులు మందిరాల్లో ప్రార్థనలు చేశారు. క్రీస్తు శిలువ త్యాగాన్ని స్మరించుకున్నారు. పురవీధుల్లో శిలువను ధరించి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధకులు మాట్లాడుతూ.. సమస్త లోక రక్షణ కోసమే క్రీస్తు బలిదానం చేశాడని అన్నారు. నాటి ఘట్టాలను సంఘస్తులకు వివరించారు. మానవాళిపట్ల ఆయన ప్రేమ, కరుణ, క్షమాభిక్షను సిలువలో వ్యక్త పరిచాడని, అదే బాటలో క్రైస్తవులు కొనసాగాలని సంఘ కాపరులు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చండ్రుగొండ: నాటి శిలుమార్గం ఘట్టాన్ని ప్రదర్శిస్తూ..



మణుగూరుటౌన్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



దమ్మపేట: శిలువను ధరించి, ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



చర్ల: గుడ్ ఫ్రైడే ప్రార్థనలు..



కరకగూడెంలో యేసు బోధనలను వివరిస్తున్న పాస్టర్ పాల్



అశ్వారావుపేటరూరల్: గుడ్‌ఫ్రైడే నేపథ్యంలో పురవీధుల్లో శిలువ యాత్ర..



ములకలపల్లి: శిలువను మోస్తూ ప్రదర్శన..



బూర్గంపాడు: రెడ్డిపాలెం-సారపాక గ్రామాల మధ్య కొనసాగిన శిలువ మార్గం